కథ

గన్నవరపు నరసింహమూర్తి

# ధర్మో రక్షతి రక్షితః

టైడా రైల్వేస్టేషన్ ముందు లూప్ లైన్‌లో ట్రాలీమీద కూర్చొని యార్డ్ గాంగ్‌కు హాజరు వేస్తున్నాడు జూనియర్ యింజనీర్ మధుసూదన్. పూర్వం వీళ్లనే పెర్మెనెంట్ వే యిన్స్పెక్టర్ (పి.డబ్ల్యు.ఐ) అనేవాళ్లు. రోజూ ఉదయం ఎనిమిది గంటలకే మొత్తం గాంగ్ అంతా అక్కడ హాజరవుతారు. వాళ్లకు హాజరు వేసిన తరువాత వాళ్లు ఏం పని ఆ రోజు చెయ్యాలో చెబుతాడు అతను. ఆ ప్రకారం వాళ్లందరూ పనుల్లో సర్దుకుంటారు.

అన్ని సెక్షన్స్‌లో రైల్వే లైన్లను మెయింటెనెన్స్ చెయ్యడం వేరు. కొత్తవలస-కిరండూల్ (కె.కె.లైను) లైను మరీ ముఖ్యంగా ఎస్.కోటనుంచి అరకుదాకా వున్న అనంతగిరి ఘాట్ సెక్షన్‌లో నిర్వహణ చాలా కష్టం. బొడ్డవర నుంచి సిమిల్‌గూడా స్టేషన్ వరకు ఉన్న ప్రాంతాన్ని అనంతగిరి ఘాట్ అంటారు. ఇది పూర్తిగా కొండల్లో నిర్మించారు. ఇందులో మొత్తం నలభై నాలుగు టన్నెల్స్ ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ లైను ప్రమాదాలకు నిలయం. కొండచరియలు విరిగి పడుతుంటాయి. అందుకే రాత్రి, పగలు ప్రమాదకరమైన ప్రదేశాల్లో పెట్రోల్‌మెన్‌ని నియమిస్తారు.

సాయంత్రం ఆరుగంటలకు ప్రతీ స్టేషన్ నుంచి యిద్దరు పెట్రోల్‌మెన్ బయలుదేరి యింకో స్టేషన్ నుంచి వచ్చిన వాళ్లను మధ్యలో కలుసుకొని తమ బీటు పుస్తకాలను మార్చుకుంటారు. ఎక్కడైనా పట్టాలు విరిగినా, బండరాళ్లు లైను మీద పడినా వెంటనే రైళ్ల రాకపోకలను వీళ్లు నియంత్రిస్తారు. దానికి అవసరమైన సామగ్రి వీరి దగ్గర ఉంటుంది.

మధుసూదన్ గేంగుకు హాజరు వేసి పనులు పురమాయిస్తుండగా శివలింగపురం స్టేషన్ వైపు నుంచి పెట్రోల్‌మెన్ రాంపండు పరుగు పరుగున ట్రాలీ దగ్గరకు వచ్చాడు. వస్తూనే ఆయాసపడుతూ "దొరగారూ! టన్నెల్ నెంబరు ఐదుకి, ఆరుకి మధ్య ఉన్న బ్రిడ్జి దగ్గర రైలు ఫ్రేక్చర్ అయింది. రెండంచీల ఖాళీ ఉంది. మీరు తొరగా రావాలి. అందుకే సూరిగాణ్ణి అక్కడుంచి వస్తున్నాను" అన్నాడు. వాడు ఈ ఐదు కిలోమీటర్ల దూరం పరిగెత్తుకుంటూ వచ్చినట్లున్నాడు.

శీతాకాలంలో మరీ ముఖ్యంగా తెల్లవారు ఝామున రైలు పట్టాలు సంకోచం వల్ల విరిగిపోతుంటాయి. వీటిని గమనించడం పెట్రోల్‌మెన్‌ల ముఖ్య బాధ్యత. అందుకే ఆ మాటలు విన్న తరువాత మధుసూదన్ ఎలర్ట్ అయ్యాడు. వెంటనే పక్కనే ఉన్న హెడ్ ట్రాలీమెన్ రామయ్యని పిలిచాడు.

"రామయ్యా! నువ్వు త్వరగా వెళ్లి బ్లాక్‌స్మిత్ నారాయణని పిలుచుకురా. గాంగ్‌లో నలుగుర్ని ట్రాలీమీద ఎక్కించు, మనం వెంటనే ఆ స్పాట్‌కి వెళ్ళాలి, లేకపోతే వీ.కె.పాసింజర్ లేటయిపోతుంది" అంటూ కంట్రోలర్‌కీ విషయం చెప్పడానికి స్టేషన్‌లోకి వెళ్లాడు మధుసూదన్.

మరో పది నిముషాలకు నలుగురు గాంగ్‌వాళ్లు, బ్లాక్‌స్మిత్‌తో ట్రాలీ బయలుదేరింది. టైడా స్టేషన్‌కి ఆ పట్టా విరిగిన ప్రాంతం దాదాపు ఐదు కిలోమీటర్లుంటుంది. తను వచ్చేవరకు రైళ్ల రాకపోకలకు అనుమతి యివ్వవద్దనీ స్టేషన్ మాస్టర్‌కి మెమో యిచ్చీ బయలుదేరడంతో ట్రాలీ స్పీడుగా పోతోంది. మరీ ముఖ్యంగా డౌన్ గ్రేడియెంట్ కావడంతో దానికి అడ్డూ ఆపూలేకుండా పోతోంది. మామూలుగా అయితే ట్రాలీ వెళ్తున్నప్పుడు ట్రాలీవాళ్లు చాలా అప్రమత్తంగా ఉండాలి.

ట్రాలీ టన్నెల్ నెంబర్ పదిని దాటుకుంటూ వెళ్తోంది. అది దాటగానే పచ్చని లోయ కనిపిస్తోంది. టన్నెల్ ప్రక్కనుంచి ఎత్తైన కొండమీదనుంచి హోరున జలపాతం క్రిందకు ఉరుకుతోంది. ట్రాలీ దాన్ని దాటుతుంటే నీటి తుంపరలు కూర్చున్న వాళ్ల మీద పడ్డాయి. టన్నెల్ దాటగానే పెద్ద వంతెన ప్రారంభమైంది. దానికి ముప్పైమీటర్ల క్రింద నది ఉధృతంగా పారుతోంది. ఆ నది హోరు, జలపాతపు శబ్దం కలసి ఆ లోయలో ప్రతిధ్వనిస్తోంది.

మధుసూదన్ ట్రాలీ పది నిముషాల తర్వాత ఆ పట్టా విరిగిన ప్రాంతం చేరుకుంది. అక్కడ రెండు సొరంగాల మధ్య ఉందీ ఆ వంతెన; ఆ వంతెనకు ముందే ఆ పట్టా విరిగింది. వెంటనే బ్లాక్‌స్మిత్ నారాయణ గేంగ్‌వాళ్ల సాయంతో పట్టావిరిగిన ప్రాంతంలో రేకు కట్టి తాత్కాలికంగా మరమ్మత్తు చేసి ట్రాక్ ఫిట్ చేశాడు; ఆ విషయాన్ని మధుసూదన్ కంట్రోల్‌కి ఫీల్డ్ టెలిఫోన్ ద్వారా తెలియపరిచీ, ఆ తరువాత గాంగ్‌తోసహా శివలింగపురం వేపుబయలుదేరాడు. ఆ విరిగిన ప్రాంతంలో యిద్దరు గేంగువాళ్లని కాపలాకి ఉంచాడు. అక్కడకి శివలింగపురం స్టేషన్ మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది.

ట్రాలీ టన్నెల్ నెంబరు మూడు దాటగానే కొద్దిగా స్లో కావడంతో మధుసూదన్ హెడ్‌ట్రాలీమెన్ వైపు చూశాడు. "దొరా అటుచూడండి, పులిలా ఉంది" అంటూ సడెన్‌గా బ్రేక్ వేశాడు. అక్కడికి కొద్దిదూరంలో ట్రాక్ పక్కన పులి పడుకొని వుంది. దాన్ని చూడగానే అందరిలో ఒక్కసారిగా వణుకు ప్రారంభమైంది. ఆ సెక్షన్‌లో పెద్దపులి తిరుగుతోందని విన్నాడు కానీ ఎప్పుడూ చూడలేదు.

ట్రాలీవాళ్లు ట్రాలీని వెనక్కు టన్నెల్ వైపు పోనిచ్చారు. ఆ పులి పడుకున్న భంగిమ చూసి మధుసూదన్ కెందుకో అనుమానం వచ్చింది. అక్కడినుంచి చూస్తే దాని రెండు కాళ్లు భూమిని ఆనించి లేవు. పైగా దాని మూలుగు వినిపిస్తోంది. కొంతసేపు ఎవ్వరూ మాట్లాడకుండా దాన్ని చూడసాగారు. అక్కడ అంతా నిశ్శబ్దం ఆవరించి ఉంది. అరగంట తరువాత ఆ పులిలో కదలిక లేకపోవడం వల్ల మధుసూదన్ అనుమానం మరింత బలపడింది. నిశ్చయంగా దానికేదో అయింది. బహుశా ఏ గూడ్స్‌ట్రైన్ గుద్దటం వల్లో ప్రమాదం జరిగి వుంటుంది అనుకొని మధుసూదన్ దానివైపు నడిచి వెళ్లాడు. అతన్ని మిగతావాళ్లు అనుసరించారు. దగ్గర్నుంచీ దాన్ని గమనించారు. దాని కాలు దగ్గర, నోటి దగ్గరా రక్తం కారుతోంది. ఏ తెల్లవారి ఝామునో ట్రైన్‌కి అడ్డంపడి

ఉంటే దెబ్బలు తగిలినట్లు న్నాయి. అందుకే ట్రాక్‌కి కొద్ది దూరంగా పడి ఉంది. బాగా దెబ్బలు తగిలినట్లున్నాయి. అందుకే నోటి ద్వారా చొంగ కారుతోంది. వెంటనే మధు ఎలర్ట్ అయ్యాడు.


"సత్యం! కొంచెం నీళ్లు పట్టుకురా" అన్నాడు యింకొక ట్రాలీమెన్‌తో. అతడు ట్రాలీమీద ఉన్న కూజాలో నీళ్లు తెచ్చి దాని ముఖం మీద చల్లాడు. ఆ నీరు పడగానే దానిలో కొద్దిగా కదలిక వచ్చింది. అంతే! బాధతో అరవడం మొదలె ట్టింది. దాని అరుపులు భీకరంగా ఉండటంతో మధుసూదన్‌కి ఏం చెయ్యాలో తోచటం లేదు. దానికి వెంటనే వైద్యం అందించకపోతే అది చనిపోయే ప్రమాదం ఉందని పించింది అతనికి. కానీ గేంగ్‌వాళ్లు వనకెందుకు దొరా అది క్రూర జంతువు. ఓదాని కోలైతే అది మన్నే చంపే స్తుంది. మనం వెళ్లిపోదాం" అన్నారు.

"తప్పురా! అందరి ప్రాణం ఒక్కటే. అది పోతుంటే కాపాడటం మనధర్మం" అంటూ యిద్దరి మనుషుల్ని అక్కడ కాపలా ఉంచి టైడా రోడ్డు పాయింట్ దగ్గరకు కాలినడకన బయలుదేరాడు. అక్కడనుంచి అడ్డదారిలో ఒక్క కిలోమీటరు వెళితే రోడ్డు వస్తుంది. అక్కడికి ఫారెస్ట్ అవుట్ ఫోస్ట్ చాలా దగ్గర. మరో అరగంటకి మధుసూదన్, ట్రాలీవాళ్లు అడ్డదారిలో ఫారెస్ట్ అవుట్ పోస్ట్‌కి చేరుకొని పులిగా యపడిన విషయాన్ని వాళ్లకు తెలియపరిచారు.

★ ★ ★

సరియైన సమయంలో మధుసూదన్ స్పందించ దంతో పులి ప్రాణాలతో బయటపడింది. ఆ కబురు తెలియగానే ఫారెస్ట్ రేంజర్, గార్డ్ దగ్గర్లోనే ఉన్న యస్.కోట నుంచి వెటర్నరీ డాక్టరుని తీసుకురావ దంతో అతను దానికి కొన్ని యింజక్షన్స్ యిచ్చి ప్రాథ మిక చికిత్స చేశాడు. ఆ సాయంత్రానికి దాని అరు పులు తగ్గాయి. ఆ తరువాత విశాఖ జూ అధికారు లకు కబురు తెలియడంతో మర్నాడు జూ డాక్టర్స్ వచ్చి దానికి పూర్తి చికిత్స చేశారు. మరో రెండురోజు లకు దాని ఆరోగ్యం కుదుటపడింది. దాన్ని విశాఖ జూకి తరలించాలనుకున్నారు కానీ ఈలోగా అది అడవిలోకి నడుచుకుంటూ వెళ్లిపోయింది. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా మధుసూదన్‌కి చాలా ఆనందం కలిగింది.

★ ★ ★



ఈ సంఘటన జరిగిన యిరవై రోజుల తరువాత ఓ రోజు మధుసూదన్ శివలింగపురం యార్డ్‌లో బండరాళ్లు ట్రాక్‌కి అడ్డంపడ్డాయని కబురు తెలియడంతో ఉదయాన్నే ఆ స్టేషన్‌కి ట్రాలీమీద వెళ్లాడు. అక్కడి యార్డ్ గాంగ్‌తో వాటిని తొలగించి ట్రాక్ ఫిట్ యిచ్చీ తిరిగి టైడా బయలుదేరాడు. అప్ గ్రేడియెంట్ కావడంతో ట్రాలీని మెల్లగా తోస్తున్నారు ట్రాలీవాళ్లు. ట్రాలీ ఐదవ నెంబరు టన్నెల్ దాటుతుండగా ఎదురుగా జరుగుతున్న దారుణాన్ని అతడు గమనించాడు. ఆ టన్నెల్‌కి ఆవలివైపున కొద్దిదూరంలో ముగ్గురు మనుషులు ట్రాక్ యొక్క ఫిష్ ప్లేట్లుని తొలగిస్తున్నారు. ఇద్దరు వాటిని తొలగిస్తుంటే మూడోవాడు తుపాకీతో నిలబడి ఉన్నాడు. వాళ్లు వేసుకునే దుస్తుల్ని బట్టి వాళ్లు నక్సలైట్లులా ఉన్నారు. ఎప్పుడూ వాళ్ల గురించి వినడమే గానీ ప్రత్యక్షంగా చూడటం అదే మొదటిసారి. ట్రాలీ టన్నెల్ మొదట్లో ఆగింది. అంత సడన్‌గా, అంత దగ్గరగా వాళ్లను చూడ్డంతో అతని కాళ్లలో వణుకు మొదలైంది. ఏం చెయ్యాలో పాలుపోని స్థితి.

అతను భయపడుతున్నది తనకు ఏం జరుగుతుందోనని కాదు. మరో అరగంటలో రాబోయే పాసింజర్ గురించి, దానికి జరగబోయే ప్రమాదం గురించి. అతని ముఖమంతా ఆందోళనతో చెమట పట్టేసింది. ఏం చేద్దామన్నా నలుగురు ట్రాలీవాళ్లు, తను మాత్రమే ఉన్నారు. దగ్గర్లో యింకో గాంగ్ కూడా లేరు. పోనీ వెనక్కి వెళ్తే..అది మరీ ప్రమాదం. ఈలోగా ఏదైనా డౌన్ ట్రైన్ వస్తే అది ప్రమాదానికి గురౌతుంది. ఇలా ఆలోచిస్తుండగా వాళ్లు తమ పని పూర్తిచేసి ట్రాలీ వైపు రాసాగారు. అందరి దగ్గరా తుపాకులున్నాయి. ముఖానికి ముసుగులున్నాయి. ఇప్పుడుగానీ ఏ ట్రైన్ వచ్చినా భారీ ప్రమాదం జరగడం ఖాయం. అందులో రెండు టన్నెల్స్‌కి మధ్యన ప్రమాదం అంటే విధ్వంసం చాలా హెచ్చుస్థాయిలో ఉంటుంది.

వాళ్లు ట్రాలీ దగ్గరకు వచ్చీ మధుసూదన్ వైపు తుపాకీలు గురిపెట్టి, "ట్రాలీని ప్రక్కకు దించి మీరందరూ ఆ వైపు వెళ్లి కూర్చోండి. తప్పించుకోవాలని చూస్తే మీ గుండెల్లో బుల్లెట్లు దిగుతాయి" అన్నారు. మధుసూదన్ మెదడు పనిచెయ్యడం మానేసింది. ట్రాలీ వాళ్ల వైపు తిరిగి సంజ్ఞ చేయడంతో వాళ్లు ట్రాలీని ప్రక్కకు దించారు. దాంట్లోనే వాళ్లు భయం భయంగా కూర్చున్నారు. క్షణాలు గడుస్తున్నాయి. ఒక్కో నిముషం గడుస్తుంటే అతనిలో ఆందోళన పెరిగిపోతోంది. అతను జరగబోయేదాని గురించి ఆలోచిస్తున్నాడు.

ఇప్పుడు ఏం చెయ్యాలి? పాసింజర్‌కు ప్రమాదం జరగకుండా ఎలా కాపాడాలి? ఆ ప్రమాదం జరిగితే కొన్ని వందలమంది చనిపోతారు. రైల్వేకు అప్రతిష్ట. తన కెరీర్‌కే మాయని మచ్చ. అతని మెదడులో ఎన్నో ఆలోచనలు. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి. అతను కళ్లు మూసుకున్నాడు.

అప్పుడు జరిగిపోయిందా సంఘటన. ఒక్కసారిగా ముప్పై మీటర్ల ఎత్తు మీద నుంచి ఒక్కసారిగా వాళ్ల మీదకు ఏదో వచ్చి పడింది. ఆ శబ్దానికి అతను కళ్లు తెరిచాడు. ఆ దూకింది ఒక పెద్దపులి. అది యిద్దరు నక్సలైట్ల మీదకు ఒకేసారి దాడి చేసి ఒకని మెడ పట్టుకుంది. రెండోవాడిని ట్రాక్ ఆవలివైపునకు విసిరేసింది. అతన్ని తనకాళ్ల క్రింద కదలకుండా ఉంచింది. అది చూసి మూడోవాడు టన్నెల్‌లోకి పారిపోయాడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఆ తరువాత ఆ పులి ఒకణ్ణి మెడను కరుచుకొని శివలింగపురం వైపు పారిపోయింది. అప్పుడు గుర్తుకు వచ్చింది మధుకి ఆ పులి తాము కాపాడిందేనని; దాని రంగు, ముఖం మీద పచ్చని మచ్చ, అతనికి బాగా గుర్తు. ఇంతలో ట్రాలీ వాళ్లు మూడోవాణ్ణి పట్టుకొని దగ్గర్లో కట్టేశారు. వాడు అప్పటికే షాక్‌కి గురయ్యాడు. రక్తం కారుతోంది వాడికి.

ఏదైతేనేం ఒక్క పెద్ద గండం గడిచింది. దాన్నించి కాపాడిన ఆ పులికి అతను మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఆరోజు దాన్ని తను కాపాడాడు, ఆ కృతజ్ఞతతో అది ఈరోజు తమని ఈ ఆపద నుంచి కాపాడింది. నిజంగా జంతువుల్లో కూడా ఎంతటి విశ్వాసం? తనను కాపాడిన వాళ్లను కాపాడాలన్న దాని మంచి మనసు మనుషుల్లో కూడా కనపడదు.

ఆరోజు ఆపదలో వున్న ఎవరినైనా కాపాడాలన్న ధర్మాన్ని తాను నిర్వర్తించడం వల్లే అది ఈరోజు ఈ పెద్దగండం నుంచీ కాపాడింది. అందుకే ధర్మోరక్షతి రక్షితః అన్నది ముమ్మాటికీ నిజం. వెంటనే తొలగించిన ఫిష్ ప్లేట్స్‌ను తిరిగి అమర్చి టైడా వెళ్లిపోయాడు అతను.

ఆ తరువాత ఎన్నోసార్లు ట్రాలీ మీద ఆ ప్రాంతం వచ్చినప్పుడు మళ్లీ ఆ పులి కనిపిస్తుందేమోనని చూసేవాడు మధుసూదన్. కానీ ఎప్పుడూ అది కనిపించలేదు.

## నిషా అదృష్టం!

*బాలీవుడ్ భామ నిషా కొఠారి తెలుగులో 'ఒక్క మగాడు' సినిమా ద్వారా పరిచయమైంది. ఈ సినిమా పరాజయం చవిచూసినా నిషాకి మాత్రం ఆఫర్లు వస్తున్నాయిప్పుడు. అటు బాలీవుడ్‌లో ఎలాగూ తన కెరీర్ చెప్పుకోదగినంత బాగాలేదు గనక టాలీవుడ్డే బెస్టనుకుంటోంది నిషా. తన దృష్టంతా ఇప్పుడు టాలీవుడ్ మీదే నిలుపుతున్నట్టు చెబుతోంది నిషా. ఓ వైపు కుర్రహీరోయిన్ హన్సిక కూడా ఇక్కడే గిట్టుబాటుగా వుందని భావిస్తుంటే నిషా కూడా తయారైందన్నమాట.*

